




# పైసా పెట్టు.. ఆర్డర్ పట్టు



బదిలీల్లో చేతివాటం!

**కాంగ్రెస్ ప్రభుత్వం** వచ్చాక విద్యాశాఖలో అవినీతి రాజ్యమేలుతున్నది. కామారెడ్డి జిల్లాలో ఈ పరిస్థితి దారుణంగా మారింది. పారదర్శకంగా ప్రభుత్వ టీచర్ల బదిలీలను చేపడుతున్నట్లుగా సర్కారు ప్రకటన గాలిమూటలే అవుతున్నాయి. బదిలీల్లో భాగంగా ఒక చోటు నుంచి మరో చోటికి వెళ్లాలంటే పైసలు ఇవ్వనిదే ఆర్డర్ కాపీలు చేతికి రావడం లేదంటే అతిశయోక్తి కాదు. కొన్ని మండలాల్లో బదిలీ వ్యవహారాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని మండల విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇందులో ఆది నుంచి కళంకితులుగా ముద్రపడిన ఎంఈవోల తీరు తీవ్ర దుమారం రేపుతున్నది. రిలీవింగ్ ఆర్డర్ జారీ చేసేందుకు బహిరంగంగానే పెద్ద ఎత్తున డబ్బులు అడుగుతుండడం విద్యాశాఖలో చర్చనీయాంశం అవుతున్నది. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రభుత్వ టీచర్లు వీరి ఆగడాలకు విలవిల్లాడుతున్నారు. తాము సభ్యత్వం తీసుకున్న యూనియన్ నాయకులకు తమ బాధలను చెప్పుకుంటే సర్వసాధారణం అంటూ కొట్టి పారేస్తుండడం విస్తు గొల్పుతున్నది. ఎంఈవోల ఆగడాలకు కళ్లెం వేయాల్సి ఉండగా యూనియన్ లీడర్లు కూడా పట్టనట్లు ఉండడంపై టీచర్లు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

–నిజామాబాద్, జూలై 7
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

## ఇదేం బేరం..

కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో టీచర్ల బదిలీల్లో బేరసారాలు భారీగా జరుగుతున్నాయి. ఏండ్లుగా ఒకేచోట పని చేస్తున్న చాలా మంది ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బదిలీ జరిగిన చోటికి ఆనందంగా వెళ్తున్నారు. తాము అనుకున్న చోటికి బదిలీ అవుతున్న ఆనందం వారిలో కొంతసేపటికే ఆవిరి అవుతున్నది. మండల స్థాయిలో విద్యాశాఖాధికారులు డబ్బుల కోసం వేధింపులకు గురిచేస్తుండడంతో ఈ దుస్థితి ఏర్పడింది. రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చేందుకు ఎంఈవోలు సతాయిస్తుం డడంతో చేసేది లేక నగదును ముట్టజెప్పుకుంటున్నారు. ఇక హెడ్‌మాస్టర్ స్థాయిలో బదిలీలు జరిగితే రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూళ్ల పర్వం యథేచ్ఛగా జరుగుతున్నది. స్కూల్ నిర్వహణకు ప్రభుత్వం మంజూ రు చేసే డబ్బులను ఇవ్వాలంటూ ఎంఈవోలే స్వయంగా ఉచిత సలహాలు చెబుతుండడంతో చేసేది లేక ఇచ్చేస్తున్నారు. డబ్బుల్లేవు అని సమాధానం చెబితే రిలీవింగ్ ఆర్డర్ జారీలో జాప్యం చేయడంతోపాటు సదరు టీచర్లకు సంబంధించిన ఫోన్లను ఎత్తకపోవడం, సమాధానం ఇవ్వకుండా సతాయించడం జరుగుతుందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సదరు కళంకిత ఎంఈవోల తీరుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చేతులెత్తేసిన లీడర్లు..

విద్యాశాఖలో జరుగుతున్న అవినీతి కంపు అధికార పార్టీకి తలవంపుగా మారుతున్నది. ఈ పరిస్థితిపై పలువురు టీచర్లు తమ గోడును అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులతో చెప్పుకున్నారు. ఇలాంటి బేరాలు సరికాదని, సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని సందేశాలు పంపించారు. కానీ అవినీతి దందా ఆగకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. పలువురు టీచర్లు మరో అడుగు ముందుకేసి యూనియన్ నేతలకు ఫోన్లు చేసి కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో జరుగుతున్న తంతుపై వివరంగా వివరాలను చెప్పారు. కానీ వారు కూడా చేతులెత్తేయడంతో టీచర్లు బాధితులుగానే మారిపోవాల్సి వస్తున్నది. యూనియన్ నేతలను ఆశ్రయించిన టీచర్ల వివరాలు లీకవ్వడంతో వారిని కక్ష కట్టి మరీ ఎంఈవో వేధిస్తుండడం విచిత్రంగా మారింది. దొందు దొందే అన్నట్లుగా కళంకిత ఎంఈవోకు పలువురు ఉపాధ్యాయ నాయకులు అండగా నిలువడం చర్చనీయాంశం అవుతున్నది. ముఖ్యంగా కామారెడ్డి నియోజకవర్గంలో ఈ వేధింపులు తారాస్థాయికి చేరుకున్నాయని సమాచారం. ఇక్కడ తిష్ట వేసుకొని కూర్చున్న ఓ అధికారి బహిరంగంగానే ఈ తంతుకు పాల్పడుతున్నట్లుగా తెలుస్తున్నది. సదరు అధికారి తీరును చూసి మిగిలిన మండలాల్లోని ఎంఈవోలు కూడా వసూళ్లకు తెగబడుతున్నట్లుగా సమాచారం. కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారికి పలు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తున్నది. కానీ డీఈవో స్థాయిలోనూ నిర్లక్ష్యమే సమాధానం రావడంతో దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తున్నది. ఈ విషయంపై కామారెడ్డి డీఈవో రాజును వివరణ కోసం నమస్తే తెలంగాణ సంప్రదించగా స్పందించేందుకు నిరాకరించారు.



ముప్కాల్‌లో గోదావరి నీళ్లను తీసుకొస్తున్న గ్రామస్తులు



ఆర్మూర్‌లో పూజలందుకున్న పెద్ద పోచమ్మ

## ఆషాఢం పూజలు షురూ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆషాఢ మాసం పూజలు ప్రారంభమయ్యాయి. గ్రామాలు, పట్టణాల్లో బోనాల పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఆదివారం పురస్కరించుకొని పలు గ్రామాల్లో గోదావరి జలాలతో గ్రామదేవతల విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. దీంతో ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొన్నది. యాటలను బలిచ్చి కుటుంబసభ్యులతో కలిసి వనభోజనాలు చేశారు.

– ఆర్మూర్‌టౌన్/ముప్కాల్, జూలై 7



అల్పాహారం కోసం ఉదయం 11:30 గంటలకు వరుసలో నిల్చున్న విద్యార్థినులు

సమయానికి అందని భోజనం

# కేజీబీవీలో అల్పాహార ఇబ్బందులు



*11:30 గంటలకు అల్పాహారం కోసం చపాతీలు చేస్తున్న వంట సిబ్బంది*

నాగిరెడ్డిపేట, జూలై 7: నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు ఆదివారం ఉదయం అల్పాహారం అందకపోవడంతో ఆకలితో ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8గంటల వరకు అల్పాహారం అందించాల్సి ఉండగా సిబ్బంది 9గంటలకు వంట పనులు ప్రారంభించారు. ఉదయం 11గంటలు దాటినా వారికి అల్పాహారం అందించలేదు. ఆదివారం సందర్శన సమయం కావడంతో పాఠశాలకు వెళ్లిన విద్యార్థినుల తల్లిదండ్రులు గుర్తించి స్థానిక విలేకరులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెళ్లి చూడగా ఆరు, ఏడు, ఎనిమిదో తరగతుల విద్యార్థినులకు అల్పాహారం అందగా తొమ్మిది, పదో తరగతి విద్యార్థినులకు అందక వరుసలో నిల్చున్నారు. వంట మనుషులు ఆలస్యంగా వస్తుండడంతో ప్రతి రోజూ అల్పాహారం సమయానికి అందడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం చికెన్ వండితే..ఒక ముక్క వేసి రసం వేస్తున్నారని..తిరిగి అడిగితే తిడుతున్నారని వాపోయారు. అన్నానికి సరిపడా కూరలు వేయడం లేదని తెలిపారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఉపాధ్యాయిని రాధికను వివరణ అడుగగా..తాను ఉదయం 10 గంటలకు వచ్చానని తెలిపారు. రాత్రి డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయిని స్వర్ణ అల్పాహారం పూర్తి చేయించి వెళ్లాలన్నారు. కానీ ఈ రోజు వంట సిబ్బంది ఆలస్యంగా రావడంతో విద్యార్థులకు సమయానికి అల్పాహారం అందించలేదని తెలిపారు. విషయాన్ని ప్రత్యేక అధికారిణి వీణకు తెలియజేశామన్నారు. పాఠశాల ప్రత్యేక అధికారిణి వీణను ఫోన్‌లో సంప్రదించగా అరగంటలో ప్రతి విద్యార్థినికి అల్పాహారం అందిస్తామన్నారు. నిర్లక్ష్యానికి కారణమైన వంట మనుషులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆమె తెలిపారు.



ప్రదర్శనశాలలో దుమ్ము పట్టిన శిల్పాలు

# పురావస్తు.. చేయాలి జబర్దస్త్

• వెలవెలబోతున్న మ్యూజియం
• పట్టించుకోవాలని చరిత్ర పరిశోధకుల వేడుకోలు

సుభాష్‌నగర్, జూలై 7 : దశాబ్ద కాలం క్రితం సందర్శకులతో కిటకిటలాడిన తిలక్‌గార్డెన్ పురావస్తు ప్రదర్శన శాల సందర్శకులు లేక అధికారుల నిర్లక్ష్యంతో వెలవెలబోతున్నది. అపురూప శిల్పా లు... శిలాశాసనాలు... తాళపత్ర గ్రంథా లు... అరుదైన వస్తువులతో నిజామాబాద్ పురావస్తు ప్రదర్శనశాల (మ్యూజియం) జిల్లాకే తలమానికంగా నిలిచింది. రూ.లక్షలు వెచ్చించి పునరుద్ధరించినా.. అధికారుల నిర్లక్ష్యంతో చీకటిలో మగ్గుతున్నది. ఆరేండ్లుగా తాళం వేసి ఉంచారు. విద్యుత్ బిల్లుల్లు కట్టలేక రెండేండ్లుగా అంధకారంలో ఉంచారు. శిల్పసంపద, మనదైన చరిత్రను తెలుసుకునే అవకాశం కల్పించాలని చరిత్ర పరిశోధకులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు

### వైభవంగా..

ఇందూరు ఉత్సవాల సందర్భంగా 2001లో అప్పటి కలెక్టర్ అశోక్‌కుమార్ తిలక్‌గార్డెన్‌లోని టౌన్ హాల్లో మ్యూజియాన్ని ప్రారంభించారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో శిల్పాలు, శిలాశాసనాలు విశేష ప్రాచుర్యం పొందిన తాళపత్ర గ్రంథాలు, నైజాంకాలం నాటి నాణేలు సేకరించి ఇక్కడ పొందుపరిచారు. వారంలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా తిలకించే అవకాశం కల్పించారు. పురావస్తు ప్రదర్శన ప్రాంగణం అంతా చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చరిత్ర పరిశోధకులతో సందడిగా ఉండేది.

### 12 ఏండ్లుగా..

పురాతన భవనం కావడంతో వానకాలంలో ఊరుస్తుండడంతో అపురూప గ్రంథాలు, ఆభరణాలు చెడిపోయే పరిస్థితి వచ్చింది. 2012 నుంచి పలు మరమ్మతుల పేరిట ఇప్పటివరకు మూసే ఉంచారు. గత ఆరేండ్ల క్రితం రూ. 40 లక్షలు వెచ్చించి డంగ్ సున్నం, రంగులతో అభివృద్ధి చేశారు. అపురూప వస్తువులను ఉంచేందుకు అవసరమైన షోకేసులు ఏర్పాటు చేస్తామని అప్పటి అధికారులు చెప్పుకొచ్చారు. పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడంతో మ్యూజియం అంతా దుమ్ము ధూళితో భయానకంగా తయారైంది. 2022లో అప్పటి కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రదర్శనశాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేసి, అందుబాటులోకి తేవాలని సూచించారు. అయినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అధికారులు స్పందించకపోవడంతో అంధకారంలో, నిశ్శబ్ద వాతావరణంలో ఉన్నది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పురావస్తు ప్రదర్శన శాలను తెరిపించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.



తిలక్‌గార్డెన్‌లోని పురావస్తు ప్రదర్శన శాల

### నేటి తరానికి చరిత్ర తెలవాలి..



ఇందూరు మ్యూజియాన్ని వెంటనే తెరిపించాలి. జిల్లా చరిత్రను తెలిపే అనేక అంశాలు ప్రదర్శనశాలలో ఉన్నాయి. వీటిని భావితరానికి తెలియజేయడం ఎంతో అవసరం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అందుబాటులోకి తీసుకురావాలి.

**- హన్మంత్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు**

### అమూల్య సంపద



అమూల్యమైన తాళపత్ర గ్రంథాలు, అరుదైన వస్తువులు, అపురూప శిల్పాలు ఉన్న మ్యూజియాన్ని అవసరమైన మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. అధికారుల నిర్లక్ష్యంతో 12 ఏండ్లపాటు మూసి ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. ఉన్నతాధికారులు స్పందించి మ్యూజియాన్ని తెరవాలి.

**- జి.ఎం. శంకర్, సీనియర్ సిటిజన్**

# కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మద్నూర్, జూలై 7: జుక్కల్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు పలువురు లబ్ధిదారులకు ఆదివారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 56 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, మండలాల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు







# ఆగుతూ.. సాగుతూ..

• అడుగంటిన భూగర్భ జలాలు • ఆందోళనలో రైతులు

**వానకాలం ప్రారంభమై** నెలరోజులు గడుస్తున్నా వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో బోరుబావుల నుంచి నీళ్లు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకు నిదర్శనమే మాక్లూర్ మండలం మదనపల్లి గ్రామానికి చెందిన రైతు రాజన్న పొలంలోని బోరు బావి దృశ్యాలు. తన పొలంలోని రెండుబోర్లు కాసేపు ఆగుతూ..మరికాసేపు నీళ్లు పారుతున్నాయని చెబుతున్నాడు. దేవుడిపై భారం వేసి నాలుగు ఎకరాల భూమిలో నాటు వేశానని, ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక బోర్లు సరిగా పారడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్